
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!







# కాంగ్రెస్ వస్తే మళ్లీ వలసలే..

- ధరణి లేకుంటే భూములకు భద్రత ప్రశ్నార్థకం
- పెరిగిన భూముల ధరలు మళ్లీ పతనం
- కరెంటు లేకుంటే గణనీయంగా తగ్గిపోనున్న సాగు విస్తీర్ణం
- ఎత్తిపోతల పథకాలకు మంగళం?
- ధైర్యంగా బతుకుతున్న రైతులు ఆగం
- అన్నిరంగాలు.. అందరిపైనా ప్రభావం

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

ములుగు/జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా వ్యవసాయరంగ అభివృద్ధి కోసం చేసిన కృషితో భుముల ధర అమాంతం పెరిగిందనేది జగమెరిగిన సత్యం. అయితే కాంగ్రెస్ చెబుతున్న మాటలు చూస్తుంటే మళ్లీ వ్యవసాయరంగం కుదేలయ్యేలా ఉందని, రైతులు ఆత్మస్థయిర్యం కోల్పోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతర కరెంటు పోయి, 10హెచ్‌పీ మోటర్లు వచ్చి ధరణి ఎత్తేసి, కౌలుదారు కాలమ్ వచ్చి, రైతుబంధుపై నీలినీడలు కమ్మితే రాష్ట్రంలో భూముల ధరలు పడిపోతాయని, ధరణి లేకుంటే భూములకు రక్షణే లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. తిరిగి పట్వారీల అజమాయిషీ వస్తే రైతుల్లో భూములపై ఇప్పుడున్న ధీమా పోతుందని, కౌలుదారు కాలమ్ భయంతో స్వయంగా వ్యవసాయం చేయలేనివారు భూమిని బీడు పెడుతారు తప్ప కౌలుకు ఇవ్వరని, ఫలితంగా సాగు పడిపోతుందని రైతుసంఘాల నాయకులు అంటున్నారు.

సాగు తగ్గిపోతే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందంటున్నారు. గ్రామాల్లో 70శాతం వ్యవసాయం మీద ఆధారపడ్డ కుటుంబాలవారు ఆదాయం కోల్పోతారని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెబుతున్నారు. మూడు గంటల కరెంటు వల్ల సాగుకు నీరు సరిపోక ఈ రకంగా చూసినా సాగు విస్తీర్ణం మీద దెబ్బపడుతుందని స్పష్టం చేస్తునారు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులమీద అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. రైతుబంధులో కౌలుదారులు, రైతుల పంచాయితీలతో గ్రామాల్లో శాంతిభద్రతల ముప్పు వాటిల్లే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరెంటు తీసేయడం, భూమికి భద్రత లేకుండా చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, సాగు విస్తీర్ణం పడిపోవడం ద్వారా భూముల ధరలు పతనమవుతాయని అంటున్నారు. ఇప్పుడు రెండు, మూడెకరాల రైతులకు కూడా భూముల ధరలు ఎంత భరోసాను, ధీమాను ఇస్తున్నాయని, ఫలితంగా రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయని, గతంలో భూములకు పెద్ద ధరలు లేక కొద్దిపాటి అప్పులకు కూడా భయపడి ఆత్మహత్యలకు పాల్పడేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు భూముల ధరలు పెరిగాక అప్పులమీద భయం పోయిందని, రైతుల్లో ధీమా వచ్చిందని చెబుతున్నారు. ధరలు మళ్లీ పాతరోజులు వస్తాయని అంటున్నారు. తెలంగాణలో చిన్న కమతాలున్న కుటుంబాలవారు అనేక మంది దూరంగా ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామాల్లోని తమ భూములను కౌలుకిచ్చి వ్యవసాయం చేయిస్తున్నారని, అంతే తప్ప కౌలుకు ఇచ్చే రైతులంతా వందల ఎకరాలున్న వారేం కాదని, చిన్న, మధ్య తరగతి ఉద్యోగులను ఈ సమస్యలన్నీ చుట్టుముడితే చిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరా అయ్యే ఈ అదనపు ఆదాయం కూడా కోల్పోతారని అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోతే మళ్లీ వలసలు మొదలవుతాయని, రైతుకిచ్చే కరెంటునే కుదించే కాంగ్రెస్, కోట్ల రూపాయలు పోసి ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో నడిపిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం దాదాపు 10వేల కోట్ల దాకా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ ఇస్తున్నారని, కాంగ్రెస్‌కు ఇంత సొమ్ము ఇచ్చే గుండె ధైర్యం ఉంటుందా? అనేది ప్రశ్నార్థకమేనంటున్నారు. పదేండ్ల కాలంగా కేసీఆర్ కష్టపడి నిర్మించిన గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుందని, ఈ వ్యవస్థను నిలబెట్టేందుకు చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం, విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ, గోదాముల నిర్మాణం, మార్కెట్ యార్డుల విస్తరణ, రైతువేదికల శిక్షణ సమాచార వ్యవస్థ అన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయంటున్నారు. ఒక్కొక్కటిగా పేర్చి నిర్మించిన వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నారు.






## రేవంత్ రెడ్డికి ఎద్దు.. ఎవుసం తెల్వది

మహదేవపూర్ : గత కాంగ్రెస్ పాలనలో ఎవుసానికి కరెంట్ సరిగా లేక నానా తంటాలు పడ్డం.లోవోల్జేజితో మోటర్, ఫ్యూజులు కాలిపోయేది. కాలిన మోటర్లు రిపేరు చేపిచ్చుడు, ఫ్యూజులు సెట్ చేసుడు అంత ఆగమాగం ఉండేది. రాత్రి పూట కరెంట్ పెట్టడానికి పోయి గోస పడ్డం. కరెంట్ సమస్యతోటి పంటలకు సరిపడ నీళ్లందక నష్టపోయేది. అప్పుడు మేము పడ్డ కట్టం చెబుతె ఒడిసేది కాదు. సీఎం కేసీఆర్ వచ్చినంకనే మా రైతులకు కరెంట్ కష్టాలు తీరినయ్. 24 గంటల ఉచిత కరెంట్‌తో పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతానయ్. సంతోషంగా ఎవుసం చేసుకుంటున్నం. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ ,బాయిల కాడ 10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని చెబుతుండ్రు. అట్లా సాధ్యమయ్యే పనేనా? 3 గంటల కరెంట్‌తోటి ఎకరం కూడా పారది.10 హెచ్‌పీ మోటర్ పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయి.ఆ మోటార్ పెట్టుడు కూడా చాలా ఖర్చైతది. అది ఎవరియ్యాలే. రేవంత్ రెడ్డికి ఎద్దు తెల్వది, ఎవుసం తెల్వది. రైతులను ఆగం చేసేందుకే రేవంత్‌రెడ్డి, కాంగ్రెసోళ్లు కుట్రలు చేత్తాండ్రు. రైతుల కోసం ఆలోచన చేసే సీఎం కేసీఆర్ సారే మళ్లా రావాలె.

**- ఓడేటి బాల్‌రెడ్డి, బొమ్మాపూర్, మహదేవపూర్**



## కాంగ్రెస్ అత్తె కరెంట్ కోతలె..

కృష్ణకాలనీ : తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇత్తున్నది. దీంతో రైతుల పంటలు బాగా పండుతున్నయి. కాంగ్రెస్ హయాంల కరెంట్ కోతలు ఎక్కువగా ఉండేటిది. తాము అధికారంలోకి అత్తె 3 గంటల కరెంట్ ఇత్తమని కాంగ్రెస్ చెప్తంది. నిజంగనె కాంగ్రెస్ అత్తె రాష్ట్రంలో కరెంట్ కష్టాలు మొదలైతయ్. పొలాలు ఎండిపోతయి. నాణ్యమైన పంటలు తీయలేం. 3 గంటల కరెంట్‌తో రైతుల ఆత్మహత్యలు ఎక్కువైతయి. 24 గంటల కరెంట్‌తో ఏటా రెండు పంటలు పండిచుకుంట సంతోషంగా ఉంటున్నం. 10 హెచ్‌పీ మోటర్లు, 3 గంటల కరెంట్ అంటున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెపుతం. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మి 24 గంటల కరెంట్ ఇచ్చే ప్రభుత్వాన్ని వదులుకుంటె నోట్ల మట్టి కొట్టుకున్నట్టె. రైతులమంతా సీఎం కేసీఆర్‌కు మద్దతు పలికి సార్‌నే మళ్లీ గెలిపించుకుంటం.

**- సంకటి సంపత్, రైతు, మైపల్లి జయశంకర్ భూపాలపల్లి**

## రైతుల బాధలు కాంగ్రెసోళ్లకు తెలుసా...

భూపాలపల్లి రూరల్ : కాంగ్రెసోళ్లకు ఏవుసం గురించి తెల్వదు. 3 గంటల కరెంట్‌తో పొలం పారుతది, 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరు. 3 గంటల కరెంట్‌తో నాకున్న 5 ఎకరాల పొలం ఎలా పారుతుంది. మళ్లా మా బతుకులు మొదటి కొత్తయి. ఎప్పుడో ఒక్కప్పుడు వర్షాకాలం తప్ప పంటలు వేసెటోళ్లం కాదు. తెలంగాణ ప్రభుత్వంలో 24 గంటలు ఫ్రీ కరెంట్ ఇస్తుప్పరు. రెండు పంటలు పండించుకుంట హాయిగా ఉన్నం. గత కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కొద్దిపాటి కరెంట్‌తో చాలీ చాలని నీళ్లతో పొలం పారేది. కరెంట్ ఎప్పుడు వచ్చేదో, పోయేదో తెలియని పరిస్థితి ఉండేది. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ఆటోమెటిక్ స్టార్టర్లు పెట్టుకొని మంచిగా వ్యవసాయం చేసుకుంటున్నం. ఎప్పుడంటే అప్పుడు పోయి నీళ్లు పెట్టుకుంటున్నం. మా కోసం ఇంత చేస్తున్న సీఎం కేసీఆర్ వెంటే రైతులమంతా ఉంటం.



**-బండారి నర్సింగరావు, మల్లంపల్లి, భూపాలపల్లి మండలం.**

## 24 గంటల కరెంట్ సాలు



ములుగు, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : నేను బీఏ ఫైనల్ ఇయర్ దాక చదివిన. చాలా సంవత్సరాల పాటు వ్యవసాయం చేసిన. ఉన్న భూమి కొడుకులకు పంచి ఇచ్చి ప్రస్తుతం ఊర్లో క్షవరాలు చేయడంతో పాటు భూములు కొలిసే పని చేస్త. రైతులకు ఇప్పుడు 24 గంటల కరెంట్ బాగుంది. నా చిన్నతనంలో ఇలాంటి కరెంట్ లేదు. దీపాల కింద సదివేది. రైతులు కూడా చాలా గోసపడ్డరు. రైతులకు 24 గంటల కరెంట్ చాలా మేలు. 3 గంటల కరెంట్ ఇస్తె రైతులు ఇబ్బందులు పడుతరు. ఒకప్పటి రోజులు కావు. ఇప్పుడు కరెంట్ ఉంటనే పంటైన, ఇంటి దగ్గరైన అన్ని పనులు జరుతయి. ఇప్పుడు ఇస్తున్న 24గంటల కరెంట్ చాలా బాగుంది.

**- తంగళ్లపల్లి నర్సయ్య, ఇంచర్ల, ములుగు**

## కాంగ్రెసోళ్ల పాలన వద్దు

కృష్ణకాలనీ : తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు మంచిగ 24 గంటల కరెంట్ ఇత్తున్నది. ఇంక కాంగ్రెసోళ్లు ఎందుకు? తెలంగాణలో వాళ్ల పాలన ఎందుకు? ఒకవేళ కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంట్, 10 హెచ్‌పీ మోటర్ల ముచ్చట చెపుతుప్పరు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే మోసపోవుడె. కాంగ్రెస్ పాలన అంటెనే భయమైతాంది. 10 హెచ్‌పీ మోటర్ పెట్టె స్థోమత పేద రైతులకు ఉండదు. ఎవరైనా 10 హెచ్‌పీ మోటర్ పెడితే బోరుబావుల్లో నీళ్లుంటయా. కాంగ్రెస్ నోటికాడి బువ్వను ఎత్తగొట్టె పని చేత్తాంది. కాంగ్రెస్ హయాంలో ఎప్పుడు కరెంట్ అత్తదో, ఎప్పుడు పోతదో తెల్వకపోయేది. బాయిల కాడికి సద్ది తీసుకొని పోయెటోళ్లం, రాత్రయితె ఇంట్ల చంటి పిల్లలను తీసుకొని పోయి చేన్లలో చెట్టుకింద పడుకోబెట్టి కరెంట్ కోసం కావలి కాసేటోళ్లం. ఎప్పుడో ఒక్కసారి కరెంట్ వస్తే ఊకేఊకే పోయేది. మోటర్లు ఎప్పటికి కాలిపోయేటివి. రాత్రి బోరుబావుల దగ్గరకు పోతే చీకట్లో విష పురుగులు కాటేసి ఎంతో మంది రైతులు సచ్చిపోయిండ్రు. కరెంట్ సక్కగ ఉండక చాలా తిప్పలు పడ్డం. పంటలు సరిగా పండించేవాళ్లం కాదు. కానీ కేసీఆర్ సర్కారు వచ్చినంక 24 గంటల కరెంట్ ఇస్తున్నడు. ఇప్పుడు యాళ్ల పొద్దుగాలనె చేన్లకు నీళ్లు పెట్టుకొని ఇంటికి వత్తున్నం. రైతు బాగు కోరే కేసీఆర్ సార్‌నే మళ్లా గెలిపించుకుంటం.

**- పెద్దిరెడ్డి భూమక్కరెడ్డి, మహిళా రైతు, జంగేడు**





## భూముల విలువ పడిపోతుంది..

నర్సంపేట : రైతులు, కౌలు రైతులకు మధ్యన వివాదాలు వస్తాయి. రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఎవ్వరికైనా ఒకరికే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దీనివల్ల రైతులు, కౌలు రైతులుకు మధ్య గొడవలు జరిగి, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడతాయి. కరెంటు మూడు గంటలే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకులను నమ్మి రైతులు వ్యవసాయం చేయలేరు. రైతుల భూములకు విలువ కూడా బాగా తగ్గిపోతాయి. సీఎం కేసీఆర్ పాలనలోనే పుష్కలంగా సాగునీరు, విద్యుత్‌తో పాటు రైతుబంధు ఇవ్వడంతో భూములకు విలువ పెరిగి, రైతులు భరోసాతో బతుకుతున్నారు. రైతుబంధుతో రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు ధరణి ఎత్తేస్తామని, సీఎం కేసీఆర్ డబ్బులను వృథా చేస్తున్నారని అంటున్నారు. ఇలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం కరెక్ట్ కాదు. దీని వల్ల నష్టపోయేది రైతులే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాలి. రైతులందరూ బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.

**- కొమ్ము రమేశ్‌యాదవ్, న్యాయవాది**

## భరోసా ఇచ్చే బీఆర్ఎస్‌కే మా మద్దతు

టేకుమట్ల : ధరణి వచ్చిన తర్వాతనే భూముల లొల్లులు తగ్గి రైతులు ఎవుసం సాఫీగ చేసుకుంటూ భరోసాగా బతుకున్నం. అంతకు ముందు తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరిగి, తిరిగి దళారులకు డబ్బులిచ్చిన సమయానికి పనులు కాకపోయేవి. ధరణితో ఇప్పుడు ఎవ్వల దందా లేకుండా ఆన్ లైన్ దరఖాస్తు చేసుకుని గంటల వ్యవధిలోనే పట్టాలు చేయించుకోగలుతున్నం. పట్టా బుక్కు కూడా కొన్ని రోజులకు ఇంటికి వత్తాంది. దీంతో ఎలాంటి పంచాయితీలు లేకుండా, పెద్దమనుషుల ఖర్చులు లేకుండా అమ్మినవాళ్లు, కొన్నోళ్లు సంతోషంగా ఉంటున్నరు. దరణిని తీసేస్తే మళ్ల ఒకరి భూములు ఒకరికి ఎక్కించి దళారులు దందా కొనసాగిస్తరు. రైతులకు మళ్ల రైతుబంధు పైసలు రాకుండా పోతయి. అందుకే రైతులకు భరోసాగా ఉన్న బీఆర్ఎస్‌కే మద్దతు ఎప్పటికుంటది.

**- బండి కుమార్, యువ రైతు, అంకుషాపూర్, టేకుమట్ల మండలం.**





## దళారుల సంపాదనకే ధరణి రద్దు

రేగొండ : కాంగ్రెసోళ్లు దళారులు డబ్బులు సంపాదించుకోవడానికె ధరణి రద్దు చేస్తామంటున్నరు తప్ప వారి మేలు కోసం కాదు. అలాంటి రాక్షస కాంగ్రెస్ పాలన మాకు వద్దే వద్దు. ఎప్పుడు రైతు మేలు కోరె ప్రభుత్వం రావాలి. రైతు మేలు కోరే ప్రభుత్వం అంటే అది కేసీఆర్ సార్ మాత్రమే. ఏండ్ల తరబడి పట్టాల కోసం కార్యాలయాల చుట్టు చెప్పులరిగేలా తిరిగినా ఎవలూ పట్టించుకోలేదు. దీంతో మా భూమి జాగలకు రక్షణ లేకుండా పోయింది. పాపం కేసీఆర్ సార్ దయవల్ల మా భూములకు రక్షణ రావడంతో బ్యాంకోళ్లు మా ఇండ్ల వద్దకే వచ్చి లోన్లు ఇస్తున్నరు. మేము ఎక్కడున్నా రైతుబంధు పైసలు మంచిగ పడుతున్నయి. మాకు ఇలాంటి పాలకులే కావాలి అందుకు మేమంతా కలిసి పనిచేస్తం. కేసీఆర్ సార్‌ను సీఎం చేస్తం.

**- తిప్పారపు శ్రీనివాసరావు, రైతు, లింగాల, రేగొండ**

## ధరణి అచ్చినంకనె ధీమాతో ఉన్నం

మహదేవపూర్: ధరణి అచ్చినంకనె రైతులం ధీమాగా ఉన్నం. గత పాలనలో పాత రెవెన్యూ పద్ధతితో ఆఫీస్‌ల చుట్టూ తిరిగి విసిగిపోయేది. భూమి రికార్డులు గందగోళంగా ఉండేది. అధికారులు చేసిన చిన్న పొరపాట్లను సరిచేయడానికి కాళ్లరిగేలా తిరిగేది. ఏ పని కావాలన్న మధ్యవర్తులు, దళారులదే నడిచేది. వాళ్లు రైతులను పీల్చి పిప్పి చేసేది. అందినకాడికి దండుకొనేది. పని కూడ సక్కగ అయ్యేది కాదు. మస్తు గోసపడ్డం. సీఎం కేసీఆర్ రైతులకు భూ రికార్డుల సమస్యలు లేకుండా తీసుకువచ్చిన ధరణితో భూ రికార్డుల సమస్యలు తీరినయ్. మా భూములు ఆన్‌లైన్‌లో భద్రంగా ఉన్నయ్. ఏ పనైనా మధ్యవర్తులు, దళారులు లేకుండా సులభంగా అయితాంది. కాంగ్రెస్ వస్తే ధరణిని తీస్తేమని అంటాన్లు. రైతులకు మేలు చేసే ధరణి తీసేస్తే మళ్లా భూరికార్డులు ఆగమైతయ్. దళారులు, మధ్యవర్తుల రాజ్యం అయితది. ధరణితో రైతులు ప్రశాంతంగా ఉన్నరు. సీఎం కేసీఆర్ సార్ వస్తేనే రైతులకు అన్ని విధాలా మేలు జరుగుతది.

**- మడ్క తిరుపతి రెడ్డి, బొమ్మాపూర్, మహదేవపూర్**



## కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో బొందపెట్టాలి



భూపాలపల్లి రూరల్ : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని రద్దు చేసి మరొకటి తెస్తె మళ్లీ దళారీ రాజ్యం వస్తది. రికార్డుల్లో భూముల వివరాలను ఇష్టమొచ్చినట్లుగా నమోదు చేస్తరు. భూ తగాదాలు ఎక్కువైతయ్. ఏ రైతు భూమి ఎవరికి ఉందో తెల్వదు. లంచాలు పెరుగుతయి. ఒకరి భూమి మరొకరికి రాసి గొడవలు పెడుతరు. ధరణి వచ్చినంక రైతులకు భరోసా ఏర్పడింది. ఎలాంటి పైరవీలు, లంచం ఇవ్వకుండా నాకున్న మూడు ఎకరాల భూమి ధరణి వచ్చాక రిజిస్ట్రేషన్ సులువుగా అయ్యింది. రైతులు సంతోషంగ ఉండడం కాంగ్రెసోళ్లకు ఇష్టం లేనట్లుంది. రైతుల జీవితాలతో చెలగాటమాడాలని సూత్తాండ్రు. సక్కగ ఉన్న ధరణిని తీసేత్తమని చెబుతున్న కాంగ్రెస్‌ను ఈ ఎన్నికల్లో బొందపెట్టాలి. పొరపాటున కూడా కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దు. రైతులకు మేలు చేసే బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తం.

**-ఇటుకాల రమ, పెద్దకుంటపల్లి, భూపాలపల్లి మండలం.**